క్లుప్తంగా

చిరుత దాడిలో ఆవు మృతి



మంగంపేట శివారులో ఆవు కళేబరం

జిన్నారం(పటాన్‌చెరు): చిరుత దాడిలో ఆవు మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని మంగంపేట గ్రామ శివారులో బుధవారం వెలుగుచూసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కటికె ఖాదర్‌కు చెందిన ఆవు మంగళవారం మేతకువెళ్లి తిరిగి రాలేదు. గ్రామ శివారులో ఆవు మృతి చెంది ఉంది. ఆవుపై చిరుత దాడి చేసినట్లు గుర్తులు ఉన్నాయి. విషయం తెలిసిన అటవీశాఖ అధికారులు ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని ఇస్నాపూర్ ఫేమస్ హోటల్ సమీపంలో ఈనెల 27వ తేదీ రాత్రి రోడ్డు దాటుతున్న గుర్తు తెలియని వ్యక్తిని (37) టీసీఎం వాహనం ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన క్షతగాత్రుడుని చికిత్సకోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ 28వ తేదీన మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పటాన్‌చెరు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, మృతుడి సంబంధీకులు ఎవరూ రాకపోవడంతో ప్రమాదం జరిగిన రోజు సంఘటన స్థలం వద్ద విధులు నిర్వహించిన పటాన్‌చెరు ట్రాఫిక్ కానిస్టేబుల్ జావిద్ ఫిర్యాదు మేరకు పోలీసులు బుధవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పీఏసీఎస్ డైరెక్టర్‌గా భారతమ్మ ఎన్నిక



భారతమ్మకు ధ్రువీకరణ పత్రం ఇస్తున్న నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని పీఏసీఎస్ వావిలాల 9వ వార్డు డైరెక్టర్‌గా సీరుడి భారతమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం ఆమెకు ధ్రువీకరణ పత్రాన్ని ఎన్నికల అధికారి చిన్న అందజేశారు. ఈ సందర్భంగా భారతమ్మ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన సర్పంచ్ పులిగిల్ల ప్రకాశ్‌చారి, ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శంకర్‌రెడ్డి, వార్డు సభ్యులు ప్రసన్న సత్యనారాయణ చారి, మమత భాస్కర్, సెక్రటరీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఓనం

పటాన్‌చెరు టౌన్: కేరళలో వైభవంగా జరుపుకునే ఓనం పండుగను రుద్రారంలోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. 'సింఫనీ ఆఫ్ హార్మోనీ' (భిన్న సమూహాల సామరస్యం) ఇతివృత్తంగా ఈఏడాది ఓనంను నిర్వహిస్తున్న విషయం విదితమే. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించారు. దేశ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించేలా ఓనం జరుపుకున్నారు.

సెల్‌ఫోన్ల అప్పగింత

నారాయణఖేడ్: సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో వారు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి పోలీసులు వాటిని స్వాధీనం చేసుకుని బాధితులకు అందజేశారు. నారాయణఖేడ్ ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన అతిక్, అహ్మద్‌బాష, సమద్, ఖేడ్ మండలం హంగిర్గా(బి) గ్రామానికి చెందిన శిరోమణి తమ సెల్‌ఫోన్లను పోగొట్టుకున్నారు. నారాయణఖేడ్ పోలీస్‌స్టేషన్‌లో ఈమేరకు ఫిర్యాదు చేసి వివరాలను అందజేశారు. పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ సహాయంతో వాటిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సెల్ ఫోన్ పోగొట్టుకున్న వారు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు.

ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌లు

సదాశివపేట(సంగారెడ్డి): 18 ఏళ్లు నిండిన యువతకు ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్ అందజేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని రాష్ట్ర హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో 21వ వార్డులోని 79 మంది యువకులకు ఉచిత లెర్నింగ్ డ్రైవింగ్ లైసెన్సులు అందజేశారు.

గొర్రెల పంపిణీ

సదాశివపేట(సంగారెడ్డి): రాష్ట్రంలోని గొల్ల కురుమలు ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు సీఎం కేసీఆర్ ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. బుధవారం పట్టణ పరిధిలోని గొల్లకురుమలకు 40 గొర్రెల యూనిట్లు మంజూరుకాగా ప్రస్తుతం 12 యూనిట్లకు సంబంధించిన గొర్రెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి సంతోష్‌కుమార్‌గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛ సంకల్పం



పెద్దలోడి గ్రామంలో ట్రాక్టర్‌లో చెత్త వేస్తున్న కార్మికుడు

- ప్రభుత్వ ట్రాక్టర్‌లో చెత్త తరలింపు
- మెరుగుపడుతున్న పారుశుద్ధ్య నిర్వహణ
- పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తున్న ప్రజలు
- ఎప్పటికప్పుడు అధికారుల పర్యవేక్షణ



చెత్తను డంపింగ్ యార్డుకు తరలిస్తున్న దృశ్యం

మునిపల్లి(అందోల్): గ్రామాల్లో స్వచ్ఛసంకల్పం పటిష్టంగా అమలు చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల పర్యవేక్షణలో పంచాయతీ కార్మికులు ప్రతీరోజు గ్రామాలను పరిసరాలను శుభ్రంగా ఉంచుతున్నారు. సేకరించిన చేత్తను గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌లో డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. ఇంటింటికి వెళ్లి చెత్త సేకరిస్తున్నారు. దీంతో పారిశుద్ధ్య నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం కూడా పెరిగింది. ప్రజలు తమ వీధుల్లోకి వచ్చే పంచాయతీ సిబ్బందికి చెత్తను అందజేస్తున్నారు. దీంతో గతంతో పోలిస్తే పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపడింది. ప్రభుత్వం పారిశుద్ధ్య పనులు, డ్రైనేజీ నిర్మాణాలకు ప్రాధాన్య ఇస్తోంది.

ఇబ్బందులు లేవు



పంచాయతీ కార్మికులు ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరిస్తున్నారు. గతంలో ఎక్కడపడితే అక్కడ చెత్త కనిపించేది. ఇప్పుడు వీధులు చాలా పరిశుభ్రంగా ఉన్నాయి. పంచాయతీ కార్మికులు ఇంటింటికి వెళ్లి సేకరించిన చెత్తను పంచాయతీ ట్రాక్టర్‌లో తీసుకెళ్లి ఒకేచోట డంపింగ్ చేస్తున్నారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్నాం.

– సమంత, మన్‌సాన్‌పల్లి, సర్పంచ్

పారిశుద్ధ్యం మెరుగుకు కృషి



గ్రామాలలో పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం. దీనికి సంబంధించి పంచాయతీ సిబ్బందితో ఎప్పటికప్పుడు చర్చిస్తున్నారు. వారికి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నాం. కార్యదర్శులు, పారిశుద్ధ్య కార్మికులు చేసే పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం.

– సురేశ్ మోహన్, డీపీఓ, జిల్లా పంచాయతీ అధికారి

ఘనంగా రక్షాబంధన్ వేడుకలు



సదాశివపేటలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్‌కు రాఖీ కడుతున్న విద్యార్థులు

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ విద్యార్థులతో కలిసి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్ బుధవారం రాఖీ వేడుక జరుపుకున్నారు. విద్యార్థులు ఉదయం చింతా ప్రభాకర్ నివాసానికి వెళ్లి ఆయనకు రాఖీ కట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, కౌన్సిలర్ విద్యాసాగర్‌రెడ్డి, కోఆప్షన్ మెంబర్ అంజయ్య, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు చీలమల్లన్న, ప్రధాన కార్యదర్శి పిల్లిగుండ్ల వీరేశం, కంబాలపల్లి సర్పంచ్ శ్రీహరి, రేషన్ డీలర్ బసంతప్ప, పాఠశాల కార్యదర్శి శ్రీనివాస్, పాఠశాల ప్రధానాచార్యులు సంగమేశ్వర్, బీఆర్ఎస్ నాయకులు, మాతాజీలు పాల్గొన్నారు.

జిన్నారం(పటాన్‌చెరు): మండల కేంద్రమైన జిన్నారంలోని వివేకానంద పాఠశాల విద్యార్థులు కరస్పాండెంట్ కరుణాసాగర్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం రక్షాబంధన్ వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమానికి హాజరైన ఎంపీడీఓ రాములు, సీఐ వేణుకుమార్, డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున స్వామి, ఏపీజీవీబీ మేనేజర్ రాజు నాయక్, పీహెచ్‌సీ సిబ్బందికి, గ్రామ పంచాయతీ కార్యాలయ సిబ్బందికి విద్యార్థులు రాఖీలు కట్టారు.

మునిపల్లి(అందోల్): రాఖీ వేడుకలను విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. బుధవారం మండలంలోని తాటిపల్లి యునైటెడ్ పాఠశాల, బుదేరా ఎస్‌వీఆర్ పాఠశాలల విద్యార్థులు రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని పరస్పరం రాఖీ కట్టుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

రుద్రారంలో వృక్షాబంధన్

నారాయణఖేడ్: మండలంలోని రుద్రారం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థినులు బుధవారం రక్షాబంధన్‌ను పురస్కరించుకొని వృక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఆవరణలోని మొక్కలు, చెట్లకు రాఖీలు కట్టారు. తాము నాటిన మొక్కలు ఏపుగా పెరిగి నీడ ఇస్తున్నాయని, ప్రతీఒక్కరూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలని కోరుకుంటూ రాఖీలు కట్టామని విద్యార్థినులు తెలిపారు. వారిని ఉపాధ్యాయులు జగదీశ్వర్, కాశీనాథ్, శివాజీ అభినందించారు.

డిగ్రీలో ప్రవేశాలకు ప్రత్యేక కౌన్సెలింగ్

నారాయణఖేడ్: డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు ఉన్నత విద్యాశాఖ మరోసారి దోస్త్ ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించనుందని నారాయణఖేడ్ ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఖేడ్ కళాశాలకు సంబంధించి బీఏలో 23, బీకాంలో 37, బీజెడ్సీలో 32, ఎంపీసీలో 48 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈనెల 28వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభంకాగా సెప్టెంబరు 4వ తేదీవరకు రిజిస్ట్రేషన్లు చేసుకుని 5వ తేదీ నుంచి వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చన్నారు. 9వ తేదీన సీట్లు కేటాయిస్తారని చెప్పారు. ఇప్పటివరకు నమోదు చేసుకున్నవారితోపాటు కొత్తగా నమోదు చేసుకునే వారికి, ఇంజనీరింగ్, నీట్, వ్యవసాయకోర్సుల్లో సీట్లు రాని వారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

ఇంటికో ఇన్‌చార్జిగా పనిచేస్తాం



నీలం మధుకు మద్దతు తెలుపుతున్న నాయకులు

పటాన్‌చెరు టౌన్: నీలం మధుకు ఎమ్మెల్యే అభ్యర్థిగా సీఎం కేసీఆర్ ఒక్క అవకాశం ఇవ్వాలని, ఇందుకు ఇంటికో ఇన్‌చార్జి ఉండి గెలిపించుకుంటామంటూ ముదిరాజ్ సంఘాల నాయకులు, ప్రజలు, యువత కోరుతున్నారు. బుధవారం వారు మాట్లాడుతూ ఇటీవల ప్రకటించిన ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితాలో రాష్ట్రంలో కీలకమైన ముదిరాజ్ సామాజిక వర్గానికి ఒక్క సీటు కేటాయించకుండా కేసీఆర్ నిర్లక్ష్యం చేయడంపై బీసీలు గొంతెత్తుతున్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో నిత్యం ప్రజాసేవ చేయడంతోపాటు బీఆర్ఎస్ పార్టీ కోసం కష్టపడుతున్న నీలం మధు ముదిరాజ్‌కు టికెట్ కేటాయించకపోవడం సరికాదన్నారు.

ప్రత్యేక బస్సు సర్వీసుల పర్యవేక్షణ



నారాయణఖేడ్ సిబ్బందితో డీఎం మల్లేశయ్య

నారాయణఖేడ్: రాఖీ పౌర్ణమి సందర్భంగా నడుపుతున్న ప్రత్యేక బస్సులను నారాయణఖేడ్ రాజీవ్ చౌక్ వద్ద బుధవారం డీఎం మల్లేశయ్య సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు. సోదరులకు రాఖీలు కట్టడానికి యువతులు, మహిళలు గ్రామాలకు రాకపోకలు సాగించే అవకాశం ఉన్ననేపథ్యంలో బుధవారం నుంచి శుక్రవారం వరకు ఖేడ్ నుంచి సంగారెడ్డి, పటాన్‌చెరు, లింగంపల్లిలకు 15 ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించారు. ఈమేరకు బుధవారం ఆయా బస్సు సర్వీసులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ టికెట్ వెనుక తమ ఫోన్ నంబర్‌రాసి స్థానికంగా ఏర్పాటు చేసిన గిఫ్ట్‌బాక్స్‌లో వేయాలని మహిళలకు సూచించారు. ఉమ్మడి మెదక్ జిల్లా రీజియన్ పరిధిలో ముగ్గురిని లక్కీడ్రాలో ఎంపికచేసి రూ.5.50 లక్షల విలువైన బహుమతులు అందించడం జరుగుతుందన్నారు. మార్కెటింగ్ సెల్ ఇన్‌చార్జి పాండు, అక్కౌంట్స్ సూపరింటెండెంట్ చందుపల్ల, విలేజ్ బస్సు అధికారులు బొర్గి శంకర్, బీఎస్ రెడ్డి, రాజు, నగేష్ పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమం

కొండాపూర్(సంగారెడ్డి): కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ సెప్టెంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు దేశవ్యాప్తంగా సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజ్ తెలిపారు. బుధవారం సంగారెడ్డిలోని కేవలం కిషన్ భవన్‌లో సీపీఎం జిల్లాస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమాన్ని పట్టించుకోకుండా మోదీ ప్రభుత్వం పెట్టుబడిదారి వర్గాలకు మేలు చేకూరుస్తుందన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

కొండాపూర్(సంగారెడ్డి): రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 24 వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయం వద్ద శాంతియుతంగా ధర్నా చేస్తున్న డీఎడ్, బీఎడ్ అభ్యర్థులపై పోలీసులు లాఠీచార్జి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ రవి అన్నారు. బుధవారం సంగారెడ్డిలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.

ఘనంగా మృకంత మహర్షి జయంతి



పల్లకీసేవ నిర్వహిస్తున్న పద్మశాలి సంఘం సభ్యులు

జహీరాబాద్ టౌన్: మృకంత మహర్షి జయంతి, రాఖీ పౌర్ణమి వేడుకలను బుధవారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భక్త మార్కండేయ ఆలయంలో అభిషేకం చేశారు. ఆర్య సమాజ్‌లో యజ్ఞం నిర్వహించారు. అంతకు ముందు ఆలయం వద్ద పతాకావిష్కరణ చేశారు. అనంతరం సంఘం సభ్యులకు మహిళలు రాఖీలు కట్టారు.

సాయంత్రం పట్టణంలో మృకంత మహర్షి పల్లకీ సేవ నిర్వహించారు. మార్కండేయ మందిరం నుంచి ప్రారంభమైన పల్లకీ ఊరేగింపు నాగులకట్ట మీదుగా గడిలోని వెంకటేశ్వర ఆలయం వరకు కొనసాగింది. కార్యక్రమంలో పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడు గడ్డం జనార్ధన్, ఉమ్మడి మెదక్ జిల్లా పద్మశాలి సంఘం మాజీ అధ్యక్షుడు డాక్టర్ చంద్రశేఖర్, నాయకులు కర్దాస్ మనోహర్, గడ్డం నాందేవ్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పి.రాములు నేత, బండారి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

ఎమ్మెల్యే మదన్ రెడ్డి



దత్తాచల క్షేత్రంలో పూజ చేస్తున్న ఎమ్మెల్యే మదన్ రెడ్డి

హత్నూర(సంగారెడ్డి): ప్రభుత్వ నిధులు తెచ్చి దత్తాచల అభివృద్ధికి కృషి చేస్తానని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన హత్నూర మదిర శివారు దత్తాచల క్షేత్రంలో పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దత్తాత్రేయ క్షేత్రానికి సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టామని, ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించామన్నారు. భక్తుల సౌకర్యార్థం వసతులు కల్పించేందుకు ప్రభుత్వం తరఫున కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అధ్యక్షుడు నర్సింహులు, జెడ్పీటీసీ అంజనేయులు, పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్‌లు వీరస్వామి గౌడ్, మాధవి నవీన్ గౌడ్, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈటలకు ఘనస్వాగతం



ఈటలకు స్వాగతం పలుకుతున్న బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, నాయకులు

పటాన్‌చెరు టౌన్: బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్, హుజూరాబాద్ శాసనసభ్యుడు ఈటల రాజేందర్ బుధవారం ఉమ్మడి మెదక్ జిల్లా సమీక్షా సమావేశానికి వెళ్తున్నారు. ఆయనకు మండలంలోని ముత్తంగి టోల్ ప్లాజా వద్ద బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్, బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దేవేందర్ గౌడ్, జిల్లా కార్యదర్శి బైండ్ల కుమార్, బీజేపీ పటాన్ చెరు పట్టణ అధ్యక్షుడు నాగరాజు యాదవ్, జిల్లా కిసాన్ మోర్చా నాయకుడు వీరారెడ్డి, వివిధ మోర్చాల అధ్యక్షుడు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన



సంగారెడ్డిలో మాట్లాడుతున్న ఆర్డీఓ రవీందర్ రెడ్డి

సంగారెడ్డి టౌన్: 18 సంవత్సరాలు నిండిన వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆర్డీఓ రవీందర్‌రెడ్డి సూచించారు. జిల్లా కార్యాలయంలో బుధవారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. కళాశాలల్లో ఓటర్ నమోదుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ఓటర్ శాతం పెంచాలన్నారు.

నారాయణఖేడ్: మండలంలోని పైడిపల్లిలో బుధవారం రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ రాజు, బీఎల్ఓగా వ్యవహరిస్తున్న అంగన్‌వాడీ టీచర్ చంద్రమ్మ గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ 18 ఏళ్లు నిండిన యువతీయువకులు విధిగా ఓటర్లుగా నమోదు చేయించుకోవాలని సూచించారు. మృతుల పేర్లు తొలగింపు, ఓటరుజాబితాలో మార్పులు చేర్పులకు సైతం అవకాశం కల్పించడం జరుగుతుందని అన్నారు.

మునిపల్లి(అందోల్): 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరూ 19వ తేదీ నాటికి ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ తెహమీనా సూచించారు. బుధవారం మండలంలోని మునిపల్లి గ్రామంతోపాటు తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు మొత్తం ఓట్లు 30,456 మంది ఓటుహక్కు కలిగి ఉన్నారన్నారు. పురుషులు 15,305 మంది, మహిళలు 15,151 మంది ఓటుహక్కు కలిగి ఉన్నారని తెలిపారు.

జిన్నారం(పటాన్‌చెరు): ఓటరు జాబితా పక్కాగా ఉండాలని తహసీల్దార్ రవికుమార్ అన్నారు. బుధవారం మండలంలోని బొల్లారం మున్సిపాలిటీలో మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి, కమిషనర్ సంగారెడ్డి, మున్సిపల్ సిబ్బంది, బీఎల్ఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ మున్సిపాలిటీలోని 76, 81 పోలింగ్ స్టేషన్‌ల ఓటరు జాబితా పరిశీలించామన్నారు. జాబితాలో తప్పులు లేకుండా చూడాలని బీఎల్ఓలకు సూచనలు ఇచ్చామన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

మనూరు(నారాయణఖేడ్): సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం మండలంలోని శెల్గిరా గ్రామంలో సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మొబైల్ యాప్‌ల్లో వచ్చే లింకులపై క్లిక్ చేయొద్దన్నారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నారాయణఖేడ్, కంగ్టి సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు నాలుగు టికెట్లు కేటాయించాలి

పటాన్‌చెరు టౌన్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసేందుకు ముదిరాజ్‌లకు బీఆర్ఎస్ పార్టీ కనీసం నాలుగు ఎమ్మెల్యే టికెట్లు కేటాయించేలా చొరవ తీసుకోవాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్‌ని నీలం మధు ముదిరాజ్ కోరారు. ప్రగతి భవన్‌లో మంత్రి హరీశ్‌రావుతో సీట్ల కేటాయింపుపై చర్చించేందుకు ఆయనతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. కేటాయించిన సీట్లలో పటాన్‌చెరు నుంచి నీలం మధు ముదిరాజ్ కు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని బండ ప్రకాశ్ కోరారు. అలాగే రాష్ట్రంలో మత్స్యశాఖ ఫెడరేషన్, కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ముదిరాజులంతా ఒక తాటిపైకి వచ్చి నిరసనలు వ్యక్తం చేస్తున్నారన్నారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని త్వరలో సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి నిర్ణయం తీసుకుంటామని మంత్రి చెప్పారని నీలం మధు ముదిరాజ్ తెలిపారు. ముదిరాజ్‌లకు న్యాయం జరిగే వరకు వివిధ కార్యక్రమాలు చేపట్టబోతున్నట్లు చెప్పారు.

విధుల బహిష్కరణ

జహీరాబాద్ టౌన్: సమస్యలు పరిష్కరం కాకుంటే సెప్టెంబర్ 2వ తేదీ నుంచి కార్మికులు విధుల బహిష్కరిస్తారని మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం(సీఐటీయూ) నాయకులు మహిపాల్ హెచ్చరించారు. సమస్యల పరిష్కారం కోసం వారం రోజులుగా కార్మికులు మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నారు. బుధవారం శిబిరం వద్ద మహిపాల్ మాట్లాడుతూ వారాంతపు సెలవులు, ఈఎస్ఐ, పీఎఫ్ సమస్యను పరిష్కరించి యూనిఫాం, సబ్బులు, నూనె కోసం డబ్బులు చెల్లించాలన్నారు. కార్మికులను పర్మినెంట్ చేయాలని, రూ.21 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు కామయ్య, యశోదమ్మ,శ్రీనివాస్, సురేష్, చంటి, శేఖర్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

4న భవిష్యత్ కార్యాచరణ

జహీరాబాద్: జహీరాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ టికెట్ ఆశించి భంగపడిన సామాజిక ఉద్యమకారుడు ఢిల్లీ వసంత్ భవిష్యత్ కార్యాచరణపై తన అనుచరులతో సమావేశమయ్యారు. ఈ మేరకు బుధవారం జహీరాబాద్‌లో సమావేశం నిర్వహించి పలువురి అభిప్రాయాలను తెలుసుకున్నారు. సెప్టెంబర్ 4వ తేదీన సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్ కార్యాచరణ ప్రకటించనున్నట్లు తెలిపారు.

పోలీసుల కార్డన్ సెర్చ్

జహీరాబాద్: పట్టణంలోని డ్రైవర్స్ కాలనీలో బుధవారం డీఎస్పీ రఘు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్డన్‌సెర్చ్‌లో 42 వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ లైసెన్సు, వాహన పత్రాలు కలిగి ఉండాలన్నారు. సైబర్ మోసాలు, రోడ్డు ప్రమాదాలు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి**

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్నట్లు మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి తెలిపారు. బుధవారం పటాన్‌చెరు మండలం రుద్రారం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఎడ్యుకేషన్ కిట్స్‌ని అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, మెడ్వాన్ సభ్యులు పాల్గొన్నారు.

◆ **మతసామరస్యం పాటిస్తున్న రాష్ట్రం**

జహీరాబాద్ టౌన్: సీఎం కేసీఆర్ అన్ని మతాలకు గౌరవం ఇస్తూ మతసామరస్యానికి పాటుపడుతున్నారని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ నామ రవికిరణ్ గుప్త అన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ధూప దీప నైవేద్యం కింద అర్చకులకు ఇచ్చే గౌరవ భృతి రూ.6 నుంచి రూ.10 వేలకు పెంచారన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

◆ **సెప్టెంబరు నుంచి నిరసన కార్యక్రమాలు**

నారాయణఖేడ్: కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు, ధరల పెరుగుదలను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సెప్టెంబరు 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు దేశవ్యాప్త ఉద్యమాలు, నిరసన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ఆపార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అతిమేల మాణిక్ తెలిపారు. నారాయణఖేడ్‌లో బుధవారం డివిజన్‌స్థాయి సమావేశం నిర్వహించారు. నిత్యావసర వస్తువుల ధరలు 2014తో పోలిస్తే 200 శాతం పెంచి కేంద్ర ప్రభుత్వం ప్రజల నడ్డివిరుస్తోందన్నారు. ప్రజావ్యతిరేకతను గమనించి ఐదు రాష్ట్రాల్లో త్వరలో ఎన్నికలు ఉండటంతో వంటగ్యాస్ ధరను తగ్గించిందన్నారు. ఖేడ్ ప్రాంత కార్యదర్శి చిరంజీవి, నాయకులు పాల్గొన్నారు.

◆ **క్రీడలతో మానసిక దృఢత్వం**

వట్‌పల్లి(అందోల్): జోగిపేట నెహ్రూ మెమోరియల్ డిగ్రీ కళాశాలలో మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని రెండు రోజులుగా కళాశాలలో క్రీడా పోటీలను ఫిజికల్ డైరెక్టర్ సుప్రియ ఆధ్వర్యంలో నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు బుధవారం ప్రిన్సిపాల్ డాక్టర్ అడవి రాజు చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీమతి లలిత, అకడమిక్ కోఆర్డినేటర్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

◆ **ప్రత్యేక పూజలు**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం నవగ్రహ హోమం, చతుర్వేద పారాయణం, స్వామి వారికి విశేష పూజలు, పద్మావతి అమ్మవారికి నిత్యహోమం నిర్వహించారు.

◆ **మహాధర్నా వాల్ పోస్టర్ ఆవిష్కరణ**

కొండాపూర్(సంగారెడ్డి): ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 1వ తేదీన తలపెట్టిన రాష్ట్ర స్థాయి మహాధర్నాను విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం సంగారెడ్డిలోని ఉన్నతి శిక్షణ కేంద్రం వద్ద మహాధర్నా వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూఎస్‌పీసీ రాంచందర్, సాయిలు, సాయితేజ, బానోత్ రవీందర్, విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

◆ **సంతోషి మాతకు పూజలు**

జహీరాబాద్: పట్టణంలోని సంతోషిమాత ఆలయాన్ని భక్తులు సందర్శించి అమ్మవారికి పూజలు చేశారు. బుధవారం సంతోషిమాత జయంతి, ఆలయ వార్షికోత్సవంలో భాగంగా అమ్మవారికి అభిషేకము, సామూహిక కుంకుమార్చన, లలితా సహస్ర పారాయణం, డోలారోహణం, మహాహారతి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ, పల్లకీసేవ చేశారు.

◆ **ఎమ్మెల్యేపై ఫిర్యాదు**

జహీరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున్ జహీరాబాద్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బుధవారం యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి ఆదేశాల మేరకు ఎస్ఐ శ్రీకాంత్‌కు ఫిర్యాదు ప్రతం అందజేశారు. కాంగ్రెస్ నాయకులపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని, ఆయనపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.